
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి

● లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బాబు

కొడిమ్యాల, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు అన్నారు. గురువారం కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర కుష్ఠు వ్యాధి నిర్మూలన బృందం సభ్యులు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం లెప్రసీ జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. జిల్లాలో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ వ్యాధికి సంబంధించిన ఎండీటీ చికిత్స ఉందని, బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బృందం సభ్యులు, జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి ప్రమోద్‌కుమార్, జిల్లా కుష్ఠు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్. శ్రీనివాస్, కొడిమ్యాల వైద్యాధికారి ఇ. పరమేశ్వరీ, డీపీఎంవో వెంకటేశ్వరాచారి, వెంకటరమణ, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సురేందర్, శంకర్‌నాయక్, డీఈఎంవో భూమేశ్వర్ పాల్గొన్నారు.

లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలి

మల్యాల, ఫిబ్రవరి 20: కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు అన్నారు. మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిని సందర్శించి కుష్ఠు వ్యాధి నివారణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన మందులు అందించడం ద్వారా నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, డీపీఎంవో శంకర్‌నాయక్, వైద్యురాలు మౌనిఖ, ఏఎన్‌ఎం, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



పెగడపల్లి, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అధికారుల గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పెగడపల్లి ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జడ్పీ సీఈఓ గౌతంరెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శిగా బి.చిరంజీవి కోరుట్ల, కోశాధికారిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా యన్.రమాదేవి, బి.లచ్చాలు, జాయింట్ సెక్రెటరీగా ఆర్.పద్మావతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా స్వరూప, ప్రచార కార్యదర్శిగా ఎం.శంకర్, కార్యవర్గ సభ్యులుగా పి.రవీందర్, సి.ఎస్.రామ్‌రెడ్డి, స్వాతి, కె.ఎస్. వెంకటేశ్వర్ రావులను ఎన్ను కున్నారు.

ఇసుక డంప్ స్వాధీనం

మల్లాపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేట గ్రామ శివారులో అక్రమంగా డంప్ చేసిన 15 ట్రాక్టర్ల ఇసుక కుప్పలను రెవెన్యూ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఇతర గ్రామాలకు సరఫరా చేయడానికి నిల్వ చేసిన ఇసుక కుప్పలను ఆర్‌ఐ సురేష్ గుర్తించారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేసినా, నిల్వ చేసినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'యూరియా అందించాలి'

రాయికల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా అందించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు ముత్యంరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం సరిపడా యూరియా సరఫరా చేయడం లేదన్నారు. దీంతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు యూరియా కొనాల్సిన పరిస్థితి ఉందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులను తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం సమస్యను త్వరగా పరిష్కరించకపోతే, రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష..



● ముప్పై ఏళ్లు దాటిన వారిలో బీపీ, షుగర్ ముప్పు

● ఎన్‌సీడీ సర్వేలో పెరిగిన బాధితులు

● ఆహారపు అలవాట్లు, జీవనశైలే కారణమంటున్న వైద్యులు

జగిత్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముప్పై ఏళ్ల దాటిన వారిలో పలువురు రక్తపోటు (బీపీ), మధుమేహంతో బాధపడుతున్నారని, జీవన శైలిలో మార్పుల ద్వారా వాటి నియంత్రణ సాధ్యమని వైద్యులు సూచిస్తున్నారు. నాన్ కమ్యూనికబుల్ డిసీస్ (ఎన్‌సీడీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమం కింద జిల్లాలో 30ఏళ్ల పైబడిన వారి జనాభా 5,83,389 ఉండగా వారికి మూడు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. వారిలో 15.24శాతం మంది బీపీ, 6.94శాతం మంది షుగర్‌తో బాధపడుతున్నట్లు తేలింది. జిల్లాలో ఎన్‌సీడీ కార్యక్రమం అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అమలు చేస్తున్నారు. పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఎన్‌సీడీ కార్నర్లు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా స్టాఫ్ నర్స్‌లను కేటాయించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఎన్‌సీడీ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు వచ్చే బీపీ, షుగర్ బాధితులకు నెలకు సరిపడా మందులు ఒకేసారి ఇస్తున్నారు.

ప్రత్యేక ట్రీట్ మెంట్ కార్డు జారీ చేసి ప్రతి నెలా మందులు జారీ, వాడకం వివరాలు నమోదు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తం గా 30 సెంటర్లలో బీపీ, షుగర్ బాధితులకు సేవలు అందుతున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

● నియంత్రణే మార్గం

బీపీ, షుగర్ ఒక్కసారి సోకితే నియంత్రణ తప్ప నివారణకు అవకాశం ఉండదని వైద్యులు అంటున్నారు. ఇలాంటి వ్యాధుల కట్టడికి కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం కింద నాన్ కమ్యూనికేబుల్ డిసీస్ కార్యక్రమాన్ని 2018సెప్టెంబర్‌లో ప్రారంభించింది. 30 సంవత్సరాల వయసులో బీపీ, షుగర్ గురయ్యే వారిని గుర్తించి ముందస్తుగా వారికి వైద్య సేవలు అందించడం తద్వారా వారి ఆయుష్షును పొడిగించడం ఈ పథకం లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో పలు విడతలుగా సర్వే నిర్వహించి బీపీ, షుగర్ బాధితులను గుర్తించగా సంబంధిత సెంటర్ల ద్వారా మందులు తీసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. అయితే మరోమారు స్క్రీనింగ్ నిర్వహిస్తే జిల్లాలో బీపీ, షుగర్ బాధితుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

జిల్లాలో బీపీ, షుగర్ బాధితుల వివరాలు...	
జిల్లాలో 30 ఏళ్లు పైబడిన వారి జనాభా	5,83,389
బీపీ బాధితులు	88,924
ఎన్‌సీడీ క్లినిక్‌ల ద్వారా మందులు వాడుతున్నది	38,630
షుగర్ బాధితులు	40,534
ఎన్‌సీడీ క్లినిక్‌ల ద్వారా మందులు వాడుతున్నది	17,882

● మరో దఫా పరీక్షలకు సన్నద్ధం

ఇప్పటికే 30 ఏళ్ల దాటిన వారిలో బీపీ, మధుమేహ బాధితులను గుర్తించేలా మూడు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. అయితే బీపీ, షుగర్‌తో పాటు మూడు రకాల వ్యాధులను గుర్తింపునకు ఇంకో విడత సర్వే చేపట్టాలని జాతీయ ఆరోగ్య మిషన్ నిర్ణయించింది. ఈ సర్వే సాధ్యమైనంత తొందరలో మొదలు కానుంది. మార్చి నెలాఖరు వరకు పరీక్షలు పూర్తి చేసేలా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. చాలా మంది బీపీ, షుగర్ బాధితులు తాము వాటి బారిన పడిన సంగతే గుర్తించడం లేదు. నిర్లక్ష్య ధోరణి కారణంగా రోజురోజుకూ..

మిగతా 8లో

కమ్మనైనది... అమ్మ భాష

● భావ ప్రకటనకు మాతృభాషే కీలకం

● తొలిపలుకులు నేర్చేది అమ్మ భాషలోనే..

● నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

6

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ నియామకం



డాక్టర్ సుమన్

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరిం టెండెంట్‌గా డాక్టర్ సుమన్ గురువారం నియమితు లయ్యారు. జిల్లా ప్రధాన ఆస్పత్రి, మాతా శిశు కేంద్రంలో పూర్తి స్థాయి సూపరింటెండెంట్ లేక నిర్వహణకు సిబ్బంది పడుతున్న ఇబ్బందులపై "ప్రధాన ఆస్పత్రికి అప్పుల తిప్పలు" అనే శీర్షికన ఈనెల 15న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనా నికి ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. గతంలో ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ రాములుపై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ కళాశాలకు సరెండర్ చేయగా, ప్రధాన ఆస్పత్రి ఆర్ఎంవోగా ఉన్న డాక్టర్ సుమన్‌కు తాత్కాలిక సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. అయితే ఆస్పత్రి, మాతా శిశు కేంద్రం నిర్వహణ మాత్రమే అప్పగించడంతో ఎలాంటి ఆర్థికపరమైన అధికారాలు లేకపోవడంతో ఆస్పత్రికి కావాల్సిన మందులు, ఇతరత్రా నిర్వహణ ఖర్చులు మొత్తం అరువు ప్రాతిపదికన తీసుకువచ్చి ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోటిన్నరకు పైగా ఆస్పత్రి నిర్వహణకు అప్పుపై వస్తువులు తీసుకురాగా, అరువు ఇచ్చినవారు సిబ్బందిపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో పూర్తి వివరాలతో కథనం రావడంతో రాష్ట్ర మెడికల్ కళాశాల డైరెక్టర్ స్పందించి డాక్టర్ సుమన్‌కు పూర్తి ఇన్‌ఛార్జిగా ఆర్థికపరమైన బాధ్యతలు కూడా ఇస్తూ గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమన్‌ను ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు ఘనంగా సన్మానించారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డే



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా వీడ్కోలు సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ గునుక శ్రీలత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ కోర్సు జీవితంలో కీలకమన్నారు. అన్ని రంగాల్లో విద్యార్థినిలు రాణించాలన్నారు. ఈకార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

'నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న సంస్థలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇస్తే త్వరగా ఉద్యోగాలు పొందుతారని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. గురువారం జిల్లా ఉపాధి కల్పనాధికారి సత్తమ్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సభ్యులతో ఆమె చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ అధికారులు, ఎస్సీ, బీసీ, మైనారిటీ వెల్ఫేర్ అధికారులు, కార్మిక శాఖాధికారి, మెప్మా, పరిశ్రమల శాఖాధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

● కలెక్టర్ సత్యప్రసాద్



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గురువారం కోరుట్ల పట్టణంలోని ఎసీగోని గుట్ట ప్రాంతంలో అక్రమంగా మట్టి తరలింపు ప్రదేశంను పరిశీలించారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని ఎక్స్‌కావేటర్‌ను, మట్టిని రవాణా చేస్తున్న వాహనాలను గుర్తించి సీజ్ చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు.

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కొరకు కోరుట్ల పట్టణంలోని 1254 సర్వే నంబర్‌లో ఉన్న 15 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆర్‌డీవో జీవాకర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం కోరుట్ల మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని పలు శాఖల రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీరు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, మున్సిపల్ కమిషనర్ తిరుపతిలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) :ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం నేర సమీక్ష సమావేశాన్ని ఎస్పీ నిర్వహించి మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారి కదలికలను గమనిస్తూ స్పెషల్ డ్రైవ్‌లతో పాటు తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి నిర్మూలను కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ భీమ్ రావు, డీఎస్పీలు రఘు చందర్, రాములు, రంగా రెడ్డి, డసీఆర్‌బీ, ఎస్‌బీ, ఐటీ కోర్, సీసీఎస్ ఇన్స్‌పెక్టరు. ఆర్‌ఐలు, సీఐలు శ్రీనివాస్, ఆరీఫ్‌అలీ ఖాన్, రఫీక్ ఖాన్, శ్రీనివాస్, కిరణ్ కుమార్, వేణు, వేణు గోపాల్, రాంనర్సింహ రెడ్డి, రవి, నిరంజన్ రెడ్డి, కృష్ణా రెడ్డి, సురేష్ తదితరులు ఉన్నారు.

●నేరం చేస్తే శిక్ష తప్పదని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ అధికారులతో ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిందితులకు శిక్షలు పడడంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర కీలకమన్నారు. పోక్సో హత్య కేసులు ప్రధానంగా భావించి ముందుకు సాగాలన్నారు. ప్రస్తుత రోజుల్లో సాంకేతికత కీలకంగా మారిందని, అన్ని కేసుల్లో సైంటిఫిక్ ఆధారాలు కచ్చితంగా సేకరించాలన్నారు. గడిచిన రెండు నెలల్లో వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న 14 మందికి జైలు శిక్షలు కోర్టుల ద్వారా విధించడం జరిగిందన్నారు. నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీలు రఘు చందర్, రాములు, రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

యూరియా కొరత లేకుండా చూస్తాం

● రైతులు ఆందోళన చెందొద్దు ● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేకుండా చూస్తానని, రైతులు ఆందోళన చెందొద్దని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని జైనా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పంపిణీ చేసిన యూరియా, నిల్వలు గురించి మండల వ్యవసాయాధికారి సింధూజను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జైనా గ్రామంలో యూరియా నిల్వలు సరిపడ లేక పంట సాగు కోసం కొంత ఇబ్బంది కలుగుతుందని రైతులు నాదృష్టికి తీసుకు వచ్చారన్నారు. వెంటనే సంబంధిత శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, డైరెక్టర్, కలెక్టర్‌తో మాట్లాడి ధర్మపురి నియోజకవర్గ పరిధిలో గల 12 పీఏసీఎస్‌లకు సరిపడే యూరియాను పంపించాలని కోరానన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రాత్రి వరకు యూరియాను పంపించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుల వేముల రాజేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, యువజన కాంగ్రెస్, మండల అధ్యక్షులు అప్పం తిరుపతి, ఏఈవో సమత, ఎన్నం మధుకర్‌రెడ్డి, రంగు అశోక్ పాల్గొన్నారు.

●ధర్మపురి పట్టణానికి చెందిన నందగిరి ప్రమీల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కొడుకు నందగిరి గిరిధర్‌ను ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి దుర్మరణం

రామగిరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపిఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పిలో అసిస్టెంట్ ఫోర్‌మన్‌గా పని చేస్తున్న ఉరకుండ రాజ్‌కుమార్(38) అనే సింగరేణి ఉద్యోగి గురువారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి వాగులో పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ ఉదయం పెద్దపల్లి-మంథని ప్రధాన రహదారిలో పెద్దపల్లి నుంచి కల్వచర్ల వైపు ఏపి15ఏజే 8307నెంబరు గల ద్విచక్రవాహనంలో వస్తున్నారు. మూల మలుపువద్ద వాహనం అదుపుతప్పి బొక్కల వాగులోకి పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి సీఐ రాజుగౌడ్ చేరుకొని మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

- కారకుడంటూ ఓ వ్యక్తి ఇంటి ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన



బాపుసాయిపేటలో ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

కోనరావుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా, అందుకు ఓ వ్యక్తి వ్యక్తి కారకుడంటూ అతడి ఇంటి ఎదుట మృతదేహంతో బంధువులు ఆందోళన దిగారు. ఇంటిని ధ్వంసం చేయడానికి యత్నించగా విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించి మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గ్రామస్థుల కథనం ప్రకారం కోనరావుపేట మండలం బాపుసాయిపేట గ్రామానికి చెందిన బత్తుల రేణ(22) అనే వివాహిత బతుకుతెరువు కోసం వేములవాడ రూరల్ గ్రామమైన నాంపల్లిలో ఉంటోంది. నాంపల్లిలో గురువారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గతంలో భర్త మల్లయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వీరిద్దరి మృతికి కారకుడు అంటూ బాపుసాయిపేట గ్రామానికి చెందిన బత్తులఅంజయ్య ఇంటిముందు రేణ మృతదేహంతో ఆందోళన దిగారు. కోపంతో ఇంటిని ధ్వంసం చేయడానికి యత్నించారు. పోలీస్ బందోబస్తు నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, ఎలాంటి సంఘటన జరగకుండా బాపుసాయిపేట గ్రామంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

కోనరావుపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోనరావుపేట మండలం బాపుసాయిపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గుంటి భూమయ్య(62) అనే వృద్ధుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయం చూసి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి విచారణజరిపి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ: మహిళకు గాయాలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగులపల్లి గ్రామ శివారులో గోదావరిఖని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్, కారుఢీకొనగా బస్‌లో ప్రయాణిస్తున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం గోదా వరిఖని వైపు వెళ్తున్న బస్‌ను కారు ఓవర్ టేక్ చేస్తూ బస్‌ను ఢీ కొట్టింది. దీంతో అప్రమత్తమైన బస్‌డ్రైవర్ బ్రేక్‌వేయడంతో పెద్దప్రమాదం తప్పిందన్నారు. బస్‌లో ప్రయాణిస్తున్న మహిళకు స్వల్పగాయాలు కాగా స్థానిక ఆసుపత్రికి తరలించారు.

రవాణాశాఖ కార్యాలయంలో దాడిచేసిన వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లారవాణాశాఖ కార్యాలయంలో ఇటీవల ఓ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన కేసులో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన రౌతు నాగరాజును గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్లలో బూడిద లోడ్‌తో వెళుతున్న రెండులారీలను జిల్లా మోటారు వాహనాల తనిఖీ అధికారి వంశీధర్ తనిఖీ చేయగా అధిక లోడు ఉన్నదని కేసు పెట్టి బస్సు డిపోకి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వాహనాల యజమాని మంగళవారం సాయంత్రం మద్యం తాగి వచ్చి రవాణాశాఖ కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసంచేసి కార్యాలయ సిబ్బంది కానిస్టేబుల్ ప్రశాంత్‌ను గాయపరిచారనే ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి అరెస్ట్ చేశామని ఆయన తెలిపారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

ముత్తారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖమ్మంపల్లి, అడవి శ్రీరాంపూర్, లక్కారం, ఓడేడు గ్రామాల్లో గుడుంబా స్థావరాలు నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సారాతయారీకి ఉపయోగించే బెల్లం పానకం సుమారు 200లీటర్లవరకు ధ్వంసంచేశారు. తనిఖీలలో ఎక్సైజ్‌ఎస్‌ఐ సాయి కుమార్, సిబ్బందిరాజేందర్,రాజ్‌కుమార్,నిరంజన్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

మక్కల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా

- డ్రైవర్‌కు స్వల్పగాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండల పరిషత్ సమీపంలోని మజీద్ ఎదురుగా ఉన్న రోడ్డులో మూలమలుపు వద్ద ఓ గొయ్యి ఏర్పడి నెలలు గడుస్తుంది. ఈ రోడ్డులో వెలుతున్న అనేక వాహనాలు గొయ్యి గమనించక ప్రమాదాల బారినపడ్డాయి. గురువారం కాల్వశ్రీరాంపూర్ నుంచి సుల్తానాబాద్‌కు మక్కల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ గొయ్యిని గమనించక మూలమలుపు వద్ద నుంచి వస్తుండగా ట్రాక్టర్ గోతిలో పడి బోల్తాపడింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. ప్రాణాపాయం తప్పింది. నెలలు గడుస్తున్నా కూడా గొయ్యిని పూడ్చడమో కానీ మరమ్మతు చేయించడమో పట్టించుకోని అధికారుల పట్ల పలువురు నిరసన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కదాడిలో పది మందికి గాయాలు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం సుందరయ్యనగర్‌లో గురువారం వీధికుక్క దాడిలో పదిమందికి గాయాలయ్యాయి. బాధితులు సుందరయ్యనగర్‌లోని అర్బన్ ఆసుపత్రికి వెళ్లగా వైద్యురాలు సాహితి చికిత్స చేసి వాక్సిన్ వేశారు. వెంటనే వైద్యురాలు మున్సిపల్‌అధికారులకు సమాచారం ఇచ్చారు.

కమ్మనైనది అమ్మ భాష



- భావ ప్రకటనకు మాతృభాషే కీలకం
- తొలిపలుకులు నేర్చేది అమ్మ భాషలోనే..
- నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

జగిత్యాల/కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మానవుడు పుట్టిన తర్వాత ఏ భాషైతే మాట్లాడుతాడో అదే అతడి మాతృ భాష. ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంగా జరుపుకోవాలని 1999 నవంబరు 17న యునెస్కో తీర్మానాన్ని ఆమోదిం చింది. ఈ దిశలో శుక్రవారం ప్రపంచ మాతృ భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం. కృష్ణ దేవరాయలతో దేశ భాషలందు తెలుగు లెస్స అని, విదేశీయులతో ఇటాలియన్ ఆఫ్ అది ఈస్ట్ అని అనిపించుకున్నది తెలుగు భాషా మెకంజి, బ్రౌన్, మన్రో, హాల్డెన్ వంటి పాశ్చాత్య చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం సమన్వయశక్తి, విభిన్న ప్రవంతులను లీనం చేసుకునే సమర్థత తెలుగు భాషకే ఉంది.

● ఆరు వేల భాషలు..

ప్రపంచంలో మొత్తం ఆరు వేల భాషలుండగా భారత దేశంలో 1,652 మాతృ భాషలున్నాయన్న అంచనా ఉంది. వీటిలో 16 భాషలకు మాత్రమే లిపి ఉంది. 200 భాషలకు 1,600లకు పైగా మాండలికాలున్నాయి. మాతృభాష అంతరించి పోయే ప్రమాదాన్ని గమనించిన యునెస్కో ప్రజల జాతీయ, పౌర, రాజకీయ, సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక హక్కుల్లో మాతృభాష అంతర్భాగమని నిర్వచించింది. దేశంలో 57 అక్షరాలు, 3 ఉభయ అక్షరాలు ఉన్న తెలుగు భాష ప్రపంచ భాషల్లోనే రెండో అతి పెద్ద మాతృ భాషగా మన్ననలు పొందుతోంది.

సంస్కృతికి మూలం..

మాతృ భాషను పరిరక్షించుకోవడమంటే మన సంస్కృతిని పరిరక్షించుకోవడమే. ఎన్నో సాహిత్య ప్రక్రియలు, సారళ్యం, స్పష్టత, సౌష్టవం, సౌందర్యం, సమన్వయం వంటి లక్షణాలు కలిగి భావ జాల వ్యాప్తికి పరస్పర సంభాషణానుకూలమై పల్లవిస్తోంది తెలుగు భాష. దేశంలో కొన్ని రాష్ట్రాల వారు మాతృ భాషకు పట్టం కడుతుంటే మనం మన భాషను మాట్లాడానికే ఇబ్బంది పడుతున్నాం. ఆంగ్లంపై మోజు పెంచుకున్న మనం తెలుగును సమున్నత రీతిలో గౌరవించలేకపోతున్నాం. తెలుగును అధికారిక భాషగా ఇప్పటికీ అమలు చేయలేక పోతున్నాం.



జాతీయ భాషగా తెలుగుకు అర్హత....
డాక్టర్ నలిమెల భాస్కర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

జాతీయ భాషగా తెలుగుకున్న గొప్ప అర్హత మరే ఇతర భాషకు లేదు. తక్కువ సమయంలో నైపుణ్యాన్ని, విస్తృత జ్ఞానాన్ని పొందవచ్చు. ఇతర భాషలను సులువుగా నేర్చుకునే సౌలభ్యం మాతృ భాష ద్వారా సాధ్యం. లిపి సౌకర్యం, అజంత భాష కావడంతో గానానుకూలంగా ఉంటుంది.



భాషను బతికించుకుందాం..
డాక్టర్ గండ్ర లక్ష్మణ్‌రావు, సాహితీవేత్త

మాతృ భాషను బతికించుకోవాలి. ఎన్నో సాహిత్య ప్రక్రియలున్న తెలుగు భాషా ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పాలి. కార్యాలయాలు, విద్యాలయాల్లో, ఇంటా బయటా తెలుగులోనే మాట్లాడుతూ అన్ని వ్యవహారాలు జరిపితేనే మాతృ భాష మనుగడ సాధిస్తుంది.

ప్రభుత్వ వ్యవహారాలన్నీ ప్రజల భాషలో నడవాలి
అన్నవరం దేవేందర్, రచయిత

మాతృ భాషలో విద్యా బోధనతో పాటు ప్రభుత్వ వ్యవహారాలన్నీ ప్రజల భాషలో నడవాలి. అన్ని స్థాయిలో తెలుగును నిర్బంధంగా అమలు చేయాలి. మాండలికాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.



తెలుగు వెలుగులు పంచాలి..
కాండూరి వేంకటేశ్వర్లు, తెలుగు పండితుడు

తెలుగు వెలుగులు పంచాలి. విద్యార్థులకు మాతృభాషకు చెందిన అష్టావధానం, అంత్యాక్షరితో పాటు సామెతలు, లోకోక్తులు, నుడికారాలు, శతక పద్యాలు, నీతి కథలు, ప్రాచీన, ఆధునిక కవులు, రచయితలను పరిచయం చేయాలి.



మాతృభాషను ప్రోత్సహించాలి
డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల

అన్ని భాషలకంటే అమ్మ భాష కమ్మనైనది. మాతృ భాషలో విద్యా బోధన విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గిస్తోంది. బిడ్డకు అమ్మ పలుకే కమ్మగా ఉంటుంది. అందుకే అమ్మ భాష తీయగా ఉంటుంది. మాతృ భాషలోని పదనిసలు, భాషా సౌందర్యం చిన్నతనం నుంచే పరిచయం అవుతుంది. మాతృ భాషకు చెందిన కథల పుస్తకాలు, నవలలు, పురాణాలు, ఇతిహాసాలు వంటి వాటిని చదవడాన్ని ప్రోత్సహించాలి.



మాతృ భాషను కాపాడుకుందాం...
అయిత అనిత, కవయిత్రి, జగిత్యాల

మాతృ భాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. మాతృ భాషపై పట్టు సాధించిన వారు మిగితా భాషలను, విజ్ఞానాన్ని తొందరగా సముపార్జించగలరు. అమ్మను ఎంత ప్రేమగా, గౌరవంగా చూసుకుంటామో మాతృ భాషను అంతే ప్రాణంగా పరిగణించాలి. విద్యార్థులకు మాతృ భాష విశిష్టతను తెలియజేసే విధంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ, మాతృ భాష వినియోగాన్ని పెంచుతూ భావి తరాలకు మాతృ భాషను కానుకగా ఇద్దాము.



గోపాల్‌రావుపేటలో దొంగతనం

రామడుగు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన గోలి మధుసూదన్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి తాళంవేసి బుధవారం బంధువుల ఇంటికివెళ్లారు. తాళం పగలగొట్టి ఇంటిలో ప్రవేశించి ప్రవేశించిన దొంగలు బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 10తులాల బంగారు ఆభరణాలతో పాటు 2.84లక్షల రూపాయలు ఎత్తుకెళ్లారు.. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామడుగు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మానకొండూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్ది మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మానకొండూర్‌లో పట్టుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దుర్శేడ్ ప్రభుత్వ పాఠశాలలో క్షుద్ర పూజల కలకలం



ప్రధానోపాధ్యాయుడి గది ఎదుట ముగ్గు, నిమ్మకాయలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్షుద్ర పూజల కలకలం రేపింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ప్రధానోపాధ్యాయుని కార్యాలయం ఎదుట పసుపు, కుంకుమ, నిమ్మకాయలు ఉంచారు. గురువారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో విద్యార్థులు స్కూల్‌కు రావడంతో వాటిని చూసి భయందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని గ్రామస్థులకు, ఉపాధ్యాయులకు తెలిపారు. అయితే గ్రామంలో ఇటువంటి సంఘటనలు జరగడం సర్వసాధారణమే అని గ్రామస్థులు అంటున్నారు.. గతంలో కొందరు ఆకతాయిలు పాఠశాలలోని బెంచీలు, స్విచ్‌బోర్డులు విరగగొట్టిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. పాఠశాల విద్యార్థులే ఈచర్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

గంజాయి రాకెట్‌ను ఛేదించిన పోలీసులు

- సీసీ కెమెరాల అమ్మకాల ముసుగులో దందా
- ఈ కామర్స్ ఏజెన్సీల ద్వారా డెలివరీ
- ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 96.7కిలోల గంజాయి పట్టివేత
- రెండు కేసుల్లో 1.2 క్వింటాళ్లు స్వాధీనం
- విలువ రూ.60లక్షలు, రెండు కేసుల్లో 15మంది అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గంజాయి ఆనవాళ్లు లేకుండా చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో రామగుండం కమిషరేట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు గంజాయి రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టాయి. పకడ్బందీ సమాచారంతో ఒకే రోజు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో దాడులు నిర్వహించి 1.2క్వింటాళ్ల గంజాయిని పట్టుకున్నారు. 15 మంది నిందితులను అరెస్టు చేసి రెండు కార్లు, ఐదు మోటార్ సైకిళ్లు, 17సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం కమిషరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీశ్రీనివాస్ అరెస్టు వివరాలను వెల్లడించారు. మంచిర్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాంప్లెక్స్ సెల్లార్‌లో సోమ ప్రవీణ్ సీసీ కెమెరాల షాపు పేర గంజాయి అమ్మకాలుచేస్తున్నట్టు గుర్తించిన పోలీసులు దందాను గుట్టు రట్టు చేశారు. సోమ ప్రవీణ్, అతని స్నేహితుడు సతీష్, మరికొందరు సీలేరు నుంచి గంజాయి తీసుకువచ్చి సీసీ కెమెరాల గోడౌన్‌లో నిల్వ చేసేవారు. అనుమానం రాకుండా ప్యాక్‌చేసి ఈ కామర్స్ డెలివరీ ఏజెన్సీల ద్వారా కస్టమర్లకు పార్శిళ్ల రూపంలో చేరవేసేవారు. అనుమానం వచ్చిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు దీనిపై నిఘా పెట్టారు. గురువారం గోడౌన్‌పై టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. బాల నేరస్థుడితో పాటు 11మందిని అరెస్టు చేయగా మరో 11మంది పరారీలో ఉన్నారు. అప్పటికే సోమ ప్రవీణ్, రాజు అనే వ్యక్తులు బయటకు వెళ్లగా ఇరుగురాళ్ల సతీష్ కుమార్(34), మహ్మద్ సమీర్(19), భీమ అనుదీప్(21), మహ్మద్ అబ్దుల్ ఉబేద్(22), అర్జున్ బాబురావు చౌహాన్(26), మహ్మద్ అజీజ్(19), జాడి రాఘవేంద్రస్వామి(23), గూడూరు రాము(20), ఎస్‌కే అతహర్(18), ఎస్‌కే సమీర్(25)లను పట్టుకున్నారు. ప్రధాన సూత్రధారి సోమ ప్రవీణ్, తగరపు రాజు, అతని భార్య శృతి, తరగపు వినయ్, రామారపు రాకేష్, శ్రీధర్, మున్ని, ఆల్ మేకర్ శ్యామ్, క్వార్టర్ సాయి, సోహెల్, చింటు పరారీలో ఉన్నారు. వీరివద్ద నుంచి 23.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 11ఫోన్లు, ఐదు బైక్‌లు, ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లు సీజ్ చేశారు.

గోదావరిఖని టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 11ఏ క్రాస్‌వద్ద గురువారం ఛత్తీస్‌గఢ్ నుంచి గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టుటౌన్ పోలీసులు తనిఖీలు జరిపారు. మహారాష్ట్రకు వెళుతున్న రెండు కార్లను తనిఖీ చేయగా కారు డిక్కీ కింది భాగంలో ప్రత్యేక బాక్స్‌లు ఏర్పాటు చేసి రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్నారు. 96.7 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉదయ్ వీర్(32), ఒడిశాకు చెందిన కేశవ్ కర, సోమనాథ్ కర, రాజస్థాన్‌కు చెందిన రాజు లోధి సంజు ఒక ముఠాగా ఏర్పడి గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ నలుగురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు సూరజ్, అర్జున్ బోరిలు పరారీలో ఉన్నట్టు సీపీ తెలిపారు. రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 1.2 క్వింటాళ్ల గంజాయి విలువ మార్కెట్‌లో రూ.60లక్షలు ఉంటుందని సీపీ శ్రీనివాస్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పట్టుబడిన నిందితులపై పీడీ యాక్టు నమోదు చేయడమే కాకుండా, వారి ఆస్తులను జప్తు చేస్తామని సీపీ హెచ్చరించారు. గంజాయిని పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్‌బీ, టాస్క్‌ఫోర్స్, మంచిర్యాల, గోదావరిఖని టుటౌన్‌పోలీసులను సీపీ అభినందించారు.

విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు, టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, టుటౌన్ సీఐ ప్రసాద్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు: సీపీ



ఇసుక క్వారీ వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న రామగుండం సీపీ శ్రీనివాస్

ముత్తారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని, అక్రమరవాణాను అరికట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఖమ్మంపల్లి, జిల్లాలపల్లిలోని ఇసుక క్వారీలను సీపీ తనిఖీచేశారు. క్వారీ సందర్శించిన అనంతరం ప్రధానంగా రవాణదారులు ఇసుకను అక్రమంగా తరలించే మార్గాలను తెలుసుకున్నారు. వాహనాల వేబిల్స్, లోడ్ పరిమితిని పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలించే వారి సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, వారి కార్యకలాపాలపై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. తనిఖీలు జరిపే సమయంలో సిబ్బంది తప్పనిసరిగా తనిఖీచేసిన వాహనవివరాలు నమోదు చేయాలని, ఇసుక తరలించే వాహనాల ధ్రువపత్రాలు ఉన్నాయే లేవో పరిశీలించాలన్నారు. ఇసుక రవాణా వాహనాలపై నిఘా పెట్టాలని, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేవిధంగా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న రీచ్‌లనుంచి ఇసుకను తరలించే విధానాన్ని సీపీ పరిశీలించారు. పెద్దపల్లి డీసీపీచేతన, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, గోదావరిఖని ఏసీపీ రమేష్, మంథని సీఐ రాజు, ముత్తారం ఎస్ఐ నరేష్ ఉన్నారు.

రెవెన్యూ శాఖలో ఏసీబీ కలకలం..

- ఏసీబీకి చిక్కిన సర్వేయర్
- ల్యాండ్ సర్వేకు రూ. 17 వేలు డిమాండ్,
- ఏసీబీని ఆశ్రయించిన ప్రైవేట్ ఉద్యోగి
- రూ.3 వేలు లంచం తీసుకుంటూ అధికారులకు చిక్కిన వైనం

మంథని, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మంథని రెవెన్యూశాఖలో పనిచేస్తున్న అవినీతి ఉద్యోగిని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలో గురువారం సాయంత్రంలంచం తీసుకుంటూ ల్యాండ్ సర్వేయర్ జాటోతు గణేష్ ఏసీబీకి పట్టుబడ్డాడు. మంథనికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి సువర్ణ క్రాంతినాగ్ వద్ద రూ.3 వేలు లంచం తీసుకోగా ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి, సీఐలు కృష్ణకుమార్, తిరుపతిలు దాడిచేసి ల్యాండ్‌సర్వేయర్ గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్ళి విచారించారు. మంథని మున్సిపాలిటీ పరిధి గంగాపురి సమీపంలోని వ్యవసాయ భూమిని సర్వే చేయటానికి ల్యాండ్ సర్వేయర్ గణేష్ రూ. 17 వేలు డిమాండ్ చేశాడు. క్రాంతి తొలుత ఈనెల5న రూ.9వేలు సర్వేయర్‌కు ఇచ్చి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం మరో రూ.3వేలు లంచం తీసుకుంటుండగా సర్వేయర్ గణేష్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈమేరకు సర్వేయర్ గణేష్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ నేషనల్ అవార్డు'కు 'నలిమెల' ఎంపిక



డాక్టర్ నలిమెల భాస్కర్

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత, అనువాదకుడు, రచయిత డాక్టర్ నలిమెల భాస్కర్‌కు ప్రతిష్ఠాత్మక 'సిటీకాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ నేషనల్‌అవార్డు' ప్రకటించారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన ప్రభుత్వ సిటీ కాలేజ్ ప్రిన్సిపల్ ఆచార్య పి బాలభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల24న ఉదయం 10-30గంటలకు ప్రభుత్వ సిటీ కళాశాల, గ్రేట్‌హాల్‌లో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుగొండ నిత్యానందరావు, అతిథులుగా మన తెలంగాణ దినపత్రిక సంపాదకుడు దేవులపల్లి అమర్, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్, రచయిత అన్నవరం దేవేందర్ పాల్గొంటారని తెలిపారు. సమావేశాన్ని కళాశాల ఆచార్యులు డాక్టర్ విష్ణుప్‌దత్ శుక్లా, డాక్టర్ ఏలూరు యాదయ్య, డాక్టర్ కోయి కోటేశ్వరరావు సమన్వయం చేయను న్నారని తెలిపారు.

మహాశివరాత్రికి ఉత్సవ కమిటీ ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 29 మందితో 5 రోజులు కొనసాగనున్న కమిటీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను విడుదల చేసింది. 29మంది సభ్యులతో ఐదు రోజుల పదవి కాలంతో పూర్తి వివరాలతో కూడిన ఉత్వర్వులను దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ విడుదల చేశారు. ఈనెల 23వ తేది నుంచి 28వ తేదివరకు ఉత్సవ కమిటీ పదివీబాధ్యతలు చేపడుతారని పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు అనుముల చంద్రం, వడ్డేపల్లి వెంకటరమణ, కే. రాజిరెడ్డి, సి. విజయలక్ష్మి, సాగరం వెంకటస్వామి, పాత సత్యలక్ష్మి, కూరగాయాల కొమురయ్య, సంద్రగిరి శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, పులి రాంబాబు, తూము సంతోష్, వకుళభరణం శ్రీనివాస్, పిల్లి కనుకయ్య, సంఘ స్వామి యాదవ్, జగన్మోహన్‌రెడ్డి, చేపూరి గంగయ, చింతపంటి రామస్వామి, కాయతి నాగరాజు,తొట్ల అంజయ్య, ఏనుగు రమేష్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, ధర్న మల్లేశం, ఒలిమినేని నిత్యానందరావు, గొట్టె ప్రభాకర్, బుస్సా దశరథం, తాటికొండ పవన్, ముప్పిడి శ్రీధర్, సుగూరి లక్ష్మి, తోట లహరిలతో కమిటీని ఏర్పాటు చేశారు.

'మహాశివరాత్రి'కి రావాలని దేవాదాయశాఖ మంత్రికి ఆహ్వానం



దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు రావాల్సిందిగా రాజన్నఆలయ ఈవో వినోద్‌రెడ్డి దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖను ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం కలిసి మహాశివరాత్రి ఆహ్వాన పత్రికను అందజేయగా, ఆలయఅర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. కాగా రెవెన్యూ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, సీఎం సలహాదారు శ్రీనివాసరాజు, లాసెక్రెటరీ తిరుపతిరెడ్డిలకు మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు.

రాజన్న భక్తులకు అందుబాటులో హెల్ప్‌లైన్ నంబర్లు..

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి జాతరకువచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం ఆలయంలో చేపట్టే జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పలువురు అధికారుల హెల్ప్‌లైన్ నంబర్లను భక్తులకు అందుబాటులో ఉంచారు. వేములవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి 7032675222, వేములవాడ ఏఎస్పీ 8712656412, రాజన్న ఆలయ ఈవో 9491000743, తహసీల్దార్ 7337234446, టౌన్‌సీఐ 8712656413, వైద్యాధికారి9440078901, మున్సిపల్‌కమిషనర్ 8008578959, స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ 8712699261, ప్రోటోకాల్‌ఆఫీస్ 08723-236040 నంబర్లను సంప్రదించాల్సిందిగా ఆలయ ఈవో కోరారు.

రంగు మారిన 'రాజన్న' ధర్మగుండం నీరు

- దుర్వాసన వస్తోందని వాపోతున్న భక్తులు
- ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలని డిమాండ్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో ఈనెల 25 నుంచి 27 వరకు మహాశివరాత్రి జాతర నిర్వహించనున్నారు. వారం రోజుల ముందు నుంచే రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. నిత్యం వేల సంఖ్యలో భక్తులు రాజన్న ఆలయానికి వస్తున్నారు. వచ్చిన భక్తులు ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని రాజన్నకు మొక్కులు చెల్లించుకుంటారు. అయితే ధర్మగుండంలోని నీరు రంగుమారి దుర్వాసన వెదజల్లుతోందని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు నీటిని శుద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.



రంగుమారిన ధర్మగుండంలోని నీరు



ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పని చేయని స్నానాల నల్లాలు..

ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు పక్కనే స్నానాలు చేసేందుకు ఆలయాధికారుల నల్లాలను ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలంగా నల్లాలు పని చేయకపోవడంతో భక్తులు ధర్మగుండంలోనే స్నానాలు చేస్తున్నారు. శివరాత్రి జాతర సందర్భంగా భక్తుల తాకిడి పెరగడంతో నల్లాలను కూడా బాగు చేయించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

ధర్మగుండంలో నీటిని ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలి

మేర్గు లక్ష్మణ్, నాంపల్లి



మహాశివరాత్రి జాతర సందర్భంగా నిత్యం 30వేల నుంచి 50 వేల వరకు భక్తులు రాజన్న దర్శనానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ధర్మగుండంలోని నీరు రంగు మారి దుర్వాసన వస్తోంది. ఎప్పటికప్పుడు నీటిని శుద్ధి చేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి. ధర్మగుండం పక్కన ఉన్న నల్లాలను సైతం ప్రారంభిస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

నీటి నాణ్యతను నిత్యం పరిశీలిస్తున్నాం..

వినోద్‌రెడ్డి, రాజన్న ఆలయ ఈవో



మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేల సంఖ్యలో భక్తులు వస్తున్న క్రమంలో సంబంధిత మెడికల్, హెల్త్ అధికారులతో నిత్యం నీటి నాణ్యతను టెస్ట్ చేయిస్తున్నాం. సంబంధిత అధికారులు సూచనలు చేసిన వెంటనే నీటిని శుద్ధి చేస్తున్నాం. ఎప్పటికప్పుడు నీటిని శుద్ధి చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్న తపాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పావని, వ్యాయామఉపాధ్యాయుడు సాన బాబు పేర్కొన్నారు. ఇటీవల గాలిపెల్లిలో జరిగిన జిల్లాస్థాయి సబ్‌జూనియర్స్ పోటీలలో బాలుర విభాగంలో సుదగోని అఖిల్, బుర్ర హర్షవర్దన్, బాలికల విభాగంలో కెశవేని అన్విత, ఎంద్ర సంజనలు ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల21నుంచి వికారాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. వీరిలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ బట్టు పద్మశ్రీనివాస్, ఈతరం యువజన సంఘ అధ్య క్షుడు గోవికారి నరేష్, కార్యదర్శి ఎంద్ర చింటులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

బెంగుళూరుకు బస్సు చార్జీలో రాయితీ

భగత్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బెంగుళూరుకు వెళ్లే బస్సు చార్జీలో పది శాతం రాయితీ ఇస్తున్నట్లు కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, గోదావరి ఖని డిపోల నుంచి బెంగుళూరుకు వెళ్లే బస్సు సర్వీసులలో బెంగుళూరు వరకు ప్రయాణించే ప్రయాణికులకు పదిశాతం రాయితీ కల్పిస్తు న్నట్లు తెలిపారు. ఈ బస్సుల్లో బెంగుళూరు వరకు ప్రయాణించే ప్రయాణికులు పదిశాతం రాయితీసౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడడం విడ్డూరం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యునిస్టులపై కేసీఆర్ మాట్లాడడం తగదన్నారు. మునుగోడు ఎన్నికల్లో కమ్యునిస్టులు లేకుంటే బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచేవాడా ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. మేడిగడ్డపై జ్యూడిషియల్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో రాజలింగు హత్యకు గురికావడంపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్రవిచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జాతీయ ఎన్నికల కమిషన్‌ను నియమించడం బీజేపీ ప్రభుత్వానికి తగదని కోర్టు జడ్జిమెంట్ ఇవ్వకముందే ఎన్నికల కమిషన్‌ను ఎలా నియమిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జాతీయ ఎన్నికల కమిషన్ నియామకంపై బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం తగదన్నారు. దేశంలో అనేకమంది ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వంలోకీలకంగా వ్యవహరిస్తున్న వారు నేరారోపణలు ఎదుర్కొంటున్నారని వారిపై ఏళ్ల తరబడి విచారణ జరగకుండా త్వరితగతిన పూర్తి చేయా లని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనను స్వాగతిస్తున్నామన్నారు. ఇదే తరహాలో దేశ వ్యాప్తంగా కులగనణ జరగలన్నారు. గత శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో సీపీఐఎన్నికల అవగాహన చేసుకుని నేటికీఅది కొనసాగుతోందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపుకోసం ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, బామండ్లపల్లి యుగేందర్, న్యాలపట్లరాజు, బోనగిరి మహేందర్, నాయకులు మామిడిపల్లి హేమంత్‌కుమార్, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక్క బోరు.. 16 కనెక్షన్లు



బోర్‌కు బిగించిన నల్లా పైపులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 2వ వార్డులో సుమారు 20 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామ పంచాయతీ చేతి పంపు ద్వారా నీరు అందకపోవడంతో ఆ కాలనీవాసులు మూడేళ్ల కిందట కలిసి డబ్బులు పోగు చేసుకుని బోరు వేయించుకున్నారు. ఒకే బోరుకు 16 కనెక్షన్లు ఇచ్చి నీటి సమస్యను అధిగమిస్తున్నారు. బోరు మోటారు, స్టార్టర్ కాలిపోతే మరమ్మతులకు అయ్యే ఖర్చులను ఇంటింటా డబ్బులు జమ చేస్తూ చెల్లిస్తున్నారు. బోరు మోటారుకు మాత్రం గ్రామ పంచాయతీ విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. విద్యుత్ సరఫరా లేనిపక్షంలో తమకు నీటికి ఇబ్బందులు తప్పడం లేవని కాలనీవాసులు పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ అసంపూర్తిగా వదిలేశారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ కాలనీకి భగీరథ నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉడకని అన్నం.. కుళ్లిన కూరగాయలు..

- కేజీబీవీని తనిఖీ చేసిన తహసీల్దార్
- సిబ్బందిపై ఆగ్రహం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మారుతిరెడ్డి

వీర్నపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉడకని అన్నం.. కుళ్లిపోయిన కూరగాయలు చూసి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సిబ్బందిపై స్థానిక తహసీల్దార్ మారుతిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను మధ్యాహ్నభోజన సమయంలో గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా అన్నం, కూరలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజన మెనూ ఏంటని సిబ్బందిని ప్రశ్నించగా ఎవరు సమాధానం ఇవ్వలేదు. విద్యార్థులకు మెనూప్రకారం భోజనం ఎందుకు అందించడం లేదన్నారు. పాఠశాలలో సరైనభోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడగగా వారం రోజులుగా అన్నం ఉడకడం లేదని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయం పూట టిఫిన్ అందించేందుకు నెలరోజులుగా గ్రైండింగ్ మిక్సీ చెడిపోయినా సరిచేయలేదన్నారు. అనంతరం అక్కడే ఉన్న స్టోర్‌రూమ్‌ను పరిశీలించగా బూజుపట్టిన క్యారెట్‌లు, కుళ్లిపోయిన టమాటాలు, ఆలుగడ్డలు కనిపించడంతో వాటిని వెంటనే అక్కడి నుంచి తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల ఆవరణలో కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు.

ప్రత్యేక అధికారి లేక పర్యవేక్షణ కరువై..

కేజీబీవీ పాఠశాలలో నెలరోజులుగా ప్రత్యేక అధికారి లేకపోవడంతో పాఠశాలలో పర్యవేక్షణ కరువైంది. ఇక్కడ పనిచేసిన ప్రత్యేక అధికారి పద్మ మర్రిపల్లి కేజీబీవీ పాఠశాలకు బదిలీకాగా, అక్కడి ప్రత్యేక అధికారి శకుంతల ఈపాఠశాలకు రావాల్సిఉండగా ఇప్పటివరకు జాయిన్‌కాలేదు. ఉన్నసిబ్బంది ఎవరికివారే ఇష్టానురీతిగా వ్యవహరించడంతో విద్యార్థులకు కష్టాలు తప్పడంలేదు. రెగ్యులర్‌స్టాఫ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ హాజరు రికార్డులను తహసీల్దార్ పరిశీలించగా మధ్యమధ్యలో కొంతమంది సంతకం చేయకుండా ఖాళీగా ఉండడం గమనించారు. రిజిస్టర్‌లో ఖాళీలు ఎందుకు ఉన్నాయని తహసీల్దార్ ప్రశ్నించగా సంతకాలు చేయడం మర్చిపోయారని సమాధానమిచ్చారు. ఇలాంటి పొరపాట్లు మరలా కనిపించద్దని తహసీల్దార్ హెచ్చరించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జడ్పీహెచ్ఎస్ పీడీ చామంతి, పాఠశాల ఇన్‌చార్జిలు పద్మ, మమత ఉన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ ఫలితాలు విడుదల

గణేష్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన హోటల్ మేనేజ్‌మెంట్ 1,3,5 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ రంగప్రసాద్ విడుదల చేశారు. ఈ ఫలితాలు www.satavahana.ac.in వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

విద్యుత్ సమస్యలుంటే అధికారులకు తెలియజేయాలి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలుంటే అధికారులకు తెలియజేయాలని టెక్నికల్ డీఈ ఉపేందర్ అన్నారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పొలంబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్న పాపయ్యపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు విద్యుత్‌కు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. రైతులు తడిచేతులతో స్టార్టర్‌బాక్సులు ముట్టుకోకూడదన్నారు. ఐరన్‌బాక్సులు ఉంటే తక్షణమే తొలగించి ప్లాస్టిక్‌స్టార్టర్ బాక్సులను పెట్టుకోవాలన్నారు. విద్యుత్తు సమస్యలుంటే నేరుగా అధికారులకు తెలియజేయాలన్నారు. లేనిపక్షంలో 1912నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈ సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



చిన్నపాపయ్యపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న టెక్నికల్ డీఈ ఉపేందర్

జాతీయస్థాయి యోగా పోటీల్లో ఐదో స్థానం



జాతీయ యోగాసన వేదికపై ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆమని

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో ఈ నెల19న జరిగిన 49వ జాతీయస్థాయి యోగాసనపోటీల్లో ఉమ్మడికరీంనగర్ జిల్లాకు చెందిన జాపతి ఆమని ప్రతిభ చాటింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన ఆమని 25-30సంవత్సరాల వయస్సు కేటగిరీలో తెలంగాణ రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించి ఐదవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆమనిని తెలంగాణ రాష్ట్రయోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షుడు కన్నకృష్ణ, యోగాకోచ్‌లు కిష్టయ్య, రామకృష్ణ, మల్లీశ్వరి అభినందించారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

- సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని, కుట్రలను తిప్పికొట్టాలి
- అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, సోషల్‌మీడియా దుష్ప్రచారం, కుట్రలను తిప్పికొట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్లశ్రీధర్‌బాబు పార్టీశ్రేణులకు సూచించారు. గురువారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎమ్మెల్సీఎన్నికల్లో నరేందర్‌రెడ్డి విజయం కోసం కృషిచేయాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో బీజేపీ, బీఆర్ఎస్‌తోపాటు కొంతమంది నరేందర్‌రెడ్డికి వ్యతిరేకంగా చేస్తున్న దుష్ప్రచారాలను, ప్రభుత్వంపై ఇతరపార్టీలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లకు గ్రూప్-1 పరీక్ష నిర్వహించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, ఏ రాష్ట్రంలో లేనివిధంగా 56వేలఉద్యోగాలు కల్పించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు 20వ తేదీ వరకు జీతాలు చెల్లించలేదని, తమ ప్రభుత్వం వచ్చాక మొదటి వారంలోనే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని శ్రీధర్‌బాబు విమర్శించారు. అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌అభ్యర్థిగా గెలిపించాలని, ఆయన గెలుపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కీలకమన్నారు. కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలిచేందుకు ప్రతిఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి విజయంకోసం కృషిచేయాలని శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యర్థులు తనను ఎదుర్కోలేక కోట్లు ఖర్చు పెడుతూ సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ శ్రేణులంతా ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి తనవిజయానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన అద్భుతంగా సాగుతోందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, అసెంబ్లీ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ప్రణవ్‌బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

వరందన్, తహసీల్దార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఏం చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి పలువురు ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆక్రమణదారులకు నోటీసులు పంపించాం. ప్రభుత్వ భూములు విక్రయించినా, కొనుగోలు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: భూసమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: రైతుల భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాం. నిబంధనల మేరకు భూసమస్యలను పరిష్కరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు జారీ చేస్తారు?

తహసీల్దార్: కొత్తరేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రస్తుతం ఆన్‌లైన్ ప్రక్రియ నడుస్తోంది. రేషన్‌కార్డులో పేర్ల తొలగింపు, కొత్తగా పేర్ల నమోదు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా లబ్ధిదారులకు అందజేస్తాం.

-గొల్లపల్లి

నేడు మంత్రి శ్రీధర్‌బాబు రాక

ధర్మపురి, ఫిబ్రవరి, 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణ సంఘ భవనంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే సమావేశంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగిస్తారని నిర్వాహ కులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి వూటుకూరి నరేందర్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

విద్యుత్ సిబ్బందికి సన్మానం

భీమారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలో గురువారం విద్యుత్ సిబ్బందికి గ్రామస్థులు సన్మానం చేశారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కోరుట్ల రూరల్ ఏడీఈ రఘుపతి ఆధ్వర్యంలో మండలంలోని గోవిందారం, పసునూరు, మోత్కురావుపేట గ్రామాల్లో సింగిల్‌ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీంతో ఏడీఈ రఘుపతి, మన్నెగూడెం ఏఈ అశోక్, సబ్ ఇంజనీర్ హరిప్రసాద్‌ను గ్రామస్థులు సన్మానించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఎండపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గొడిశెలపేట గ్రామంలోని ముస్కు రాజెందర్ రెడ్డి, పాతగూడూర్ గ్రామంలోని పుష్కమల్ల రాజేశం ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు పొనుగోటి శ్రీనివాస్‌రావు పరామర్శించారు.

యూరియా కొరతతో రైతుల ఇక్కట్లు



మాదాపూర్ సహకార సంఘ భవనం వద్ద బారులు తీరిన రైతులు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోసం కోరుట్ల మండలం మాదాపూర్ సహకార సంఘ భవనం వద్ద గురువారం రైతులు బారులు తీరారు. 900 బ్యాగుల యూరియా సహకార సంఘ కేంద్రం వద్ద భద్రపరిచారు. దీంతో రైతులు ఉదయమే కేంద్ర వద్దకు భారీగా చేరుకున్నారు. దీంతో మొత్తం యూరియాను పంపిణీ చేయగా మరి కొంత మంది రైతులకు అందలేదు. వారి జాబితాను సేకరించిన సమకార సంఘ సిబ్బంది జిల్లా ఉన్నత అధికారులకు పంపారు. యూరియా అందని రైతులకు రెండు రోజుల్లో అందిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

●**బీర్‌పూర్:** యూరియా కోసం రైతులు గంటల తరబడి నిరీక్షిస్తూ వ్యవసాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో గురువారం ఉదయం 5 గంటలకు వచ్చి క్యూలో ఉన్నా ఒక్క బస్తా కూడా ఇవ్వలేదని గ్రామానికి చెందిన మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు ఒకే బస్తా ఇస్తున్నారని, అది కూడా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి సరిపడా యూరియా బస్తాలు అందించాలని కోరారు.

యూరియా కోసం ఉదయం 5గంటలకు వచ్చా
-పత్తి లక్ష్మి, మహిళా రైతు, నర్సింహులపల్లి



యూరియా బస్తాల కోసం ఉదయం 5గంటలకు వచ్చా. ఇప్పటి వరకు ఒక్క బస్తా కూడా ఇవ్వలేదు. రెండు ఎకరాలు ఉంది. ఎకరాకు ఒకే బస్తా ఇస్తే సరిపోదు.

ప్రస్తుతానికి ఎకరాకు ఒక బస్తా ఇస్తున్నాం
-రాజుకుమార్
మండల వ్యవసాయ అధికారి, బీర్‌పూర్

యూరియా కొరత లేదు. వచ్చిన యూరియా బస్తాలలో ఎకరాకు ఒక బస్తా ఇచ్చి సర్దుబాటు చేయాలని సిబ్బందికి చెప్పాం. రైతులు ఇబ్బంది పడుతున్నట్లు నా దృష్టికి రాలేదు.

'పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి'

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావును టీ పెన్షనర్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో కలిసి పెండింగ్ బిల్లులు మంజూరులో తీవ్రమైన ఆలస్యం జరుగడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లా కేంద్రంలో తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. తమ అసోసియేషన్ సభ్యులుగా ఉండి మరణించిన వారి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు.

హైదరాబాద్‌లో ఆర్థిక శాఖ కార్యదర్శిని కలువగా స్పందిస్తూ దశలవారీగా ఉద్యోగుల పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామన్నారని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక తప్పకుండా అంశాలవారీగా బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలన అవినీతిమయం

-జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలన అవినీతిమయమని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆమె విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి వెన్నుముకగా భావించే పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రంలో రైతుల దుస్థితి అత్యంత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ పేర్కొన్నట్లుగానే కాంగ్రెస్‌కు ఓటేస్తే గోసపడుతారని, రైతుబంధు, రుణమాఫీ అందకుండా పోతుందన్నారన్నారు. ఆయన అన్నట్లుగానే ప్రస్తుత పరిస్థితులు గోచరిస్తున్నాయన్నారు. కేసీఆర్ పాలన ఓ స్వర్ణయుగం అని అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉండడం విచారకరం అన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు అవసరమైన రైతుబంధు, ఎరువులు, విత్తనాలు, కరెంటు సకాలంలో అందేదని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పండించిన పంటలకు నీరందక టేలెండ్ ప్రాంతాల రైతులతో పాటు నియోజకవర్గ రైతాంగం ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికి తోడు పంటలు కాపాడుకునేందుకు అవసరమైన యూరియా దొరకక ఫర్టిలైజర్ షాపులు, ఎరువుల విక్రయ గోదాంల వద్ద చెప్పులు, ఆధార్‌కార్డులు లైన్‌లో పెట్టి యూరియా కోసం ఎదిరిచూసే పరిస్థితులు రావడం విచారరం అన్నారు. ఉమ్మడి సారంగాపూర్ మండలంలోని టేలెండ్ గ్రామాలకు నీరందని పరిస్థితి ఉందని, అలాగే జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి, మోరపల్లి గ్రామాల్లో తూములు పాడై, మరమ్మత్తు చేయించకపోవడంతో పంటలకు నీరందకుండా పోయిందన్నారు. సహకార సంఘాలకు యూరియా ఇండెంట్ కోసం డబ్బులు చెల్లించిన యూరియా అందించడం లేదన్నారు. కనీసం బఫర్‌స్టాక్ నిల్వలు కూడా ఉంచకపోవడం ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, ప్రధాన కార్యదర్శి అల్లాల ఆనందరావు, సింగిల్ విండో చైర్మెన్‌లు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, నాయకులు కల్లూరి హరీష్, ఆదిరెడ్డి, కమలాకర్‌రావు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రాయికల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్, లయన్ మోర హన్మాండ్లు అన్నారు. మండలంలోని ఇటిక్యాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి ఆస్పత్రి వైద్యులతో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 153 మందికి కంటి పరీక్షలు చేయగా, 36 మందిని ఆపరేషన్ కోసం గుర్తించి రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. అనంతరం శ్రీని ల్యాబ్ ఆధ్వర్యంలో ఉచితంగా షుగర్ నిర్ధారణ పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మ్యాకల రమేష్, కొమ్ముల ఆదిరెడ్డి, బత్తిని భూమయ్య, కాటిపెల్లి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్, కోశాధికారి కట్ల నర్సయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు బొడుగం అంజిరెడ్డి, కనపర్తి శ్రీనివాస్, మండలోజు శ్రీనివాస్, బెక్కెం తిరుపతి, జిల్లాల సూర్యం రెడ్డి, వైద్యులు ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

కొడిమ్యాల, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలకు అనుగునంగా 15వ సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మండలంలో ఈ నెల 5 నుంచి 20 వరకు 24 గ్రామ పంచాయతీలలో ఏప్రిల్1, 2023 నుంచి, మార్చి 31, 20224 వరకు జరిగిన పనులపై సామాజిక బృందాలు తనిఖీ నివేదికను అందించుటకు ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

5వ పేజీ తరువాయి..

బాధితుల సంఖ్య పెరుగుతోంది. మానసిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, తగిన వ్యాయమం లేకపోవడం, సమయానికి తినకపోవడం వంటి కారణాలతో ఈ పరిస్థితి ఎదురవుతోందని వైద్యులు చెబుతున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం
-డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జగిత్యాల



దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో భాగంగా బాధితులకు ఎన్‌సీడీ ద్వారా మెరుగైన సేవలందిస్తున్నాం. బీపీ, షుగర్ బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే బాధితులుగా తేలిన వారు మందులు వాడేలా పర్యవేక్షిస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధులు దరి చేరకుండా ప్రతీ ఒక్కరు వ్యాయామం చేస్తూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలి.

ఇసుక టిప్పర్ పట్టివేత

కథలాపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని కలికోట శివారులో గురువారం టాస్క్‌ఫోర్స్ అధికారులు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నారు. పట్టుకున్న టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టిప్పర్‌ను పట్టుకున్న వారిలో పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల అధికారులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలి

బీర్‌పూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన భూమిని కబ్జా చేసి గృహలు నిర్మించుకున్న వారిని కాళీచెయించి ఆ భూమిని గ్రామానికి అప్పగించాలని గురువారం నర్సిహులపల్లి గ్రామ ప్రజలు తహసీల్దార్ ముంతాజుద్దీన్‌కు, ఎంపీడీవో లచ్చాలుకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, మాజీ సర్పంచ్ రిక్కెల ప్రభాకర్, చెరుపూరి సుభాస్, సుశీన్, సబ్బా దేవరాజం పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం మండల కార్యవర్గం

సారంగాపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బాదినేని వెంకటేష్, ఉపాధ్యక్షులు, అత్తినేని శ్రావణ్, అత్తినేని నరేష్, ప్రధాన కార్యదర్శి బాస నాగేందర్, కోశాధికారి, రామగిరి రాజిరెడ్డి, సంయుక్త కార్యదర్శి అయిత ప్రవీణ్, కార్యదర్శి కొక్కు గంగారాం, మహేష్, సభ్యులుగా బాదినేని శేఖర్, బుక రవి. సలహదారులుగా చిట్యాల భూమరెడ్డి, లెక్కల శేఖర్, కోల నర్సింహరెడ్డి, మ్యాడ ఐలయ్య, గురునాథం మల్లారెడ్డి, కోల శ్రీనివాస్, అత్తినేని రాంగోపాల్, ఆకుల రమేష్, రెంటం జగదీష్‌లు ఎన్నికయ్యారు.

నిధులు విడుదల చేయాలి

సారంగాపూర్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు సంబంధించిన గత సంవత్సరం ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని గురువారం పంచాయితీ కార్యదర్శులు ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయితీల పాలక వర్గం ముగిసిన నాటి నుండి గ్రామ పంచాయితీ పనుల నిర్వహణ అయిన పారిశుద్య నిర్వహణకు ట్రాక్టరుకు డీజిల్, బ్లీచింగ్, బయోటెక్స్ ఫాగింగ్, వీధి దీపాలు, తాగు నీటికి సంబంధించిన నిర్వహణ కోసం క్రెడిట్ తీసుకువచ్చి పనులు చేయించడం భారంగా మారిందని, ఆగస్టు నెల నుండి ఐఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటన్నే విడుదల చేయాలని కోరారు. నిధులు అందుబాటులో లేని గ్రామ పంచాయితీల్లో ఖర్చు చేసిన డబ్బులు చెల్లించలేని పరిస్థితి ఉందని గ్రామ పంచాయితీలకు అవసరం ఉన్న నిధులను నేరుగా టీఎస్ బీపాస్ ఖాతాకు విడుదల చేయాలని, అదే విధంగా గ్రామ పంచాయితీ సాధారణ నిధులను ట్రెజరికి అను సందానం లేకుండా నేరుగా చెల్లింపులు జరుపుటకు అవకాశం కల్పింల్సిందిగా వినతి పత్రంలో పేర్కొన్నారు. ఫర్మ్ నుండి క్రెడిట్ ఇవ్వకపోతే మార్చి 1 నుండి గ్రామ పంచాయితీల నిర్వహణ చేయలేమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయ గ్రామ పంచాయితీలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

ఎండపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేట గ్రామంలో గత వారం రోజుల నుంచి సాంకేతిక కారణాలతో పత్తి కొనుగోళ్ళు నిలిచిపోయినందున నేటి నుంచి మళ్ళీ కొనుగోళ్ళు యధావిధిగా ప్రారంభం అవుతాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చెర్మెన్ గుండాటి గోపిక జితెందర్ రెడ్డి తెలిపారు.

రైతులు దళారులను నమ్మి పత్తిని అమ్ముకోవద్దని నేరుగా జిన్నింగ్ మిల్లులకు తీసుకువచ్చి మద్ధతు ధర పొందాలన్నారు. రైతులందరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జిన్నింగ్ మిల్లులలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

●ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని ఇందిరా భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించిన ఘనత నరేందర్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్‌లు జీఆర్ దేశాయి, విజయ లక్ష్మి, టిపిసిసి అధికార ప్రతినిధి బండ శంకర్, కాంగేస్ పార్టీ జగిత్యాల పట్టణ అధ్యక్షులు చాంద్ పాషా పాల్గొన్నారు.

●రాయికల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నుంచే నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ రూపొందించి ఉద్యోగాల భర్తీ చేపట్టిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలోని వీఎస్ గార్డెన్‌లో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యఓఉడు గోపి రారెడ్డి, మాజీ సర్పంచులు భూమారెడ్డి, తంగెళ్ల రమేష్, గంగారెడ్డి, హనుమాన్ ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్ పాల్గొన్నారు.

'నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు'

మల్యాల, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపుకు పాటు పడితే నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మల్యాలలో గురువారం ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం కోసం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రులకు, యువత కోసం జాబ్ క్యాలెండర్ అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 54వేల ఉద్యోగాలు ఇచ్చిందని పట్టభద్రులకు వివరించి ఓటు అభ్యర్థించాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎన్నికల ఇన్‌చార్జీ, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, విండో చైర్మన్ రాంలింగారెడ్డి, నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, వీరబత్తిని శోభరాణి, ముత్యం శంకర్, లక్ష్మారెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, శనిగారపు తిరుపతి, శ్రీకోటి శ్రీకాంత్ పాల్గొన్నారు

●కొడిమ్యాల, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి) : చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాలతో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి ఊటుకూరి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ గురువారం సాయంత్రం మండల కేంద్రంలో పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రాజేందర్, ప్రసాద్, జితెందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేక అధికారిగా కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జీవాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జీవాకర్ రెడ్డిని ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ కృపాకర్‌లతో పాటు సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికింది. ఈ కార్యక్రమంలో ప్రజాపరిషత్ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కోరుట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జీఎస్ గార్డెన్‌లో గురువారం శ్రీ చైతన్య విద్యార్థులు చేసిన ఆటపాట అలరింపజేసింది. పట్టణంలోని జీఎస్ గార్డెన్‌లో పాఠశాల నిర్వహకుల ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహిం చగా విద్యార్థుల కేరింతల మధ్య సాగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శేఖర్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్వేతలతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నియామకం చేపట్టాలి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో విదులు నిర్వహిస్తున్న మూడవ, నాల్గవ తరగతి ఉద్యోగుల నియామకం చేపట్టాలని డిమాండ్ చేస్తు గురువారం పట్టణంలోని ఎల్ఐసి ఉద్యోగుల భోజన విరామ సమయంలో కార్యలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసీ మూడవ, నాల్గవ తరగతి ఉద్యోగుల నియామకలు చేపట్టి సంఘం గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి బ్రాంచ్ యూనియన్ అధ్యక్షులు తిరుక్కో వెల శ్రీనివాస్, కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

వ్యాపారుల సిండికేట్‌తో రైతులకు నష్టం

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 20 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పసుపుకు వ్యాపారుల సిండికేట్‌గా మారి చెప్పిన ధరకే అమ్ముకొని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి విమర్శిం చారు. గురువారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి వ్యవసాయ మార్కె ట్‌లో కొందరు వ్యాపారస్థులు సిండికేట్‌గా మారి యార్డుకు రైతులు తీసుకొచ్చిన పసుపుకు క్వింటాలుకు రూ.11వేల కన్నా తక్కువ రేటుతో కొనుగోలు చేస్తున్నారన్నారు.

నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

-డీఆర్‌డీవో పీడీ రఘువరణ్



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో రఘువరణ్

గొల్లపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం సమీపిస్తున్న దృష్ట్యా నర్సరీ కేంద్రాల్లో మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని డీఆర్‌డీవో పీడీ రఘువరణ్ అధికారులను ఆదేశించారు. గురువారం గొల్లపల్లి మండలం రాపల్లె గ్రామంలోని నర్సరీ కేంద్రంను, కంపోస్ట్ షెడ్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాబోవు వానాకాలం వరకు ప్రభుత్వ లక్ష్యం మేరకు వివిధ రకాల మొక్కలను నర్సరీ కేంద్రాల్లో పెంచాలని, వాటిని సంరక్షించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలను పెంచేందుకు అవసరమైన మౌళిక వసతులను అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీ కేంద్రాల్లో నీటి వసతులు, కూలీల కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కంపోస్ట్ షెడ్‌లు నిరూపయోగంగా మారకుండా చర్యలు చేపట్టాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం లక్ష్యంతో నిర్మించిన కంపోస్ట్ షెడ్‌లను వాడకంలోకి తెచ్చి పారిశుధ్యంను పూర్తిగా పారద్రోలి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. అనంతరం మండలంలోని అబ్బాపూర్ గ్రామంలో ఉన్న సోలార్ ప్లాంట్‌ను డీఆర్‌డీవో పీడీ సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించిన దృష్ట్యా సోలార్ ప్లాంట్ ఏర్పాటు వల్ల మహిళలు ఏ మేరకు ఆర్థిక పరిపుష్టి సాధించగలరు అన్న వివరాలు అడిగితెలుసుకున్నారు. అలాగే సోలార్ ప్లాంట్ నిర్వహణ మహిళ సంఘాలకు అవగాహన కల్పించడం తదితర అంశాల పై సోలార్ ప్లాంట్ నిర్వహకులతో చర్చించారు.

సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి, ఎన్‌పీడీసీఎల్ పంపిణీ తదితర వివరాల పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సామ రాంరెడ్డి, ఏపీవో వేణు, ఆయా గ్రామాల పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం'



ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న అధికారులు

ధర్మపురి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, జెండర్ స్పెషలిస్టు గౌతమి అన్నారు. ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్, దమ్మన్నపేట గ్రామాల్లో గల అంగన్‌వాడి సెంటర్‌లో బేటీ బచావో-బేటీ పడావో పది సంవత్సరాల వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా సాధికారత బృందం ఆధ్వర్యంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, జెండర్ స్పెషలిస్టు గౌతమి మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని అన్నారు. అదే విధంగా బాలికలను బాలురతో పాటు సమానంగా పోషించాలని, తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం, చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. క్రమ శిక్షణతో ఎదిగే విధంగా చూసుకోవాలని ఆమె వివరించారు. ప్రతి ఒక్కరు బాల్య వివాహం చేయడం ద్వారా బాలిక తనకు ఉన్న హక్కులను కోల్పోతుందని ఆమె తెలిపారు. అంతేగాకుండ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా మిషన్ శక్తి, మహిళా సాధికారత, సఖీ కేంద్రం 181, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, సైబర్ క్రైమ్ 1930 వివిధ రకాల సేవలు, వాటి ఆవశ్యకత గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలిమ, కుసుమ, ఏఎన్ఎం సత్యగంగ, బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ శ్రీనివాస్, చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ మానస పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

జగిత్యాల ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి ఓటు వేయాల్సిందిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి గురువారం జగిత్యాల కోర్టులో న్యాయవాదులను ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, ఉపాధ్యక్షులు అనుమల్ల కృష్ణ హరి, పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ అయ్యన్న గారి భూమన్న, జుంబర్తి దివాకర్, మ్యాదరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గురువారం బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిం చారు. పట్టణంలోని పలు ప్రైవెట్ ఆసుపత్రులలో వైద్యులు విద్యాసాగర్ రెడ్డి, పూదరి శ్రీనాథ్‌తో పాటు వైద్యులను కలుస్తు ప్రచారం జరిపారు.

ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ల సంక్షేమా హక్కుల కోసం నిరంతరం కృషి చేసే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంజిరెడ్డికి మొదటి ప్రధాన్యత ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయ్, కృష్ణమూర్తి, నరేష్, శ్రీకార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న హరికృష్ణకు మద్దతివ్వాలి

ధర్మపురి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఏసీఈ హైస్కూల్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ బిళ్లకూరి శేఖర్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసన్న హరికృష్ణను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగ సమస్య తొలగిపోతుందని అన్నారు. ఎన్నికల్లో ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట అక్కల నరేష్, బిసగోని శ్రీనివాస్‌గౌడ్, తిరుమన్‌దాసు శ్రీనివాస్, మహేష్, ముసిపట్ల రాజేందర్, బ్రహ్మాండభేరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.